

## కొత్త అనుభూతినిచ్చే సినిమా రెట్రో

''రెట్రో' పూర్తిగా డైరెక్టర్ సినిమా. కార్తీక్ సుబ్బరాజ్ కొత్త జానర్‌లో సినిమా తీశాడు. తప్పకుండా ఆడియన్స్‌కి కొత్త అనుభూతినిస్తుంది. సంతోష్ నారాయణ్ అద్భుతమైన పాటలిచ్చారు. ప్రకాష్‌రాజ్, నాజర్, జోజూ జార్జ్ ఇలా గొప్ప నటులు ఇందులో భాగం అయ్యారు. త్వరలో సితార ఎంటర్టైన్మెంట్స్‌లో వెంకీ అట్లూరి దర్శకత్వంలో సినిమా చేయబోతున్నా. ఆ వివరాలు త్వరలో చెప్తాం. మే1న 'రెట్రో' రాబోతుంది. అలాగే నాని 'హిట్-3' కూడా అదేరోజు రానుంది. రెండూ బాగా ఆడాలి. అలాగే త్వరలో రాబోతున్న విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' పెద్ద హిట్ కావాలి. '' అని హీరో సూర్య ఆకాంక్షించారు. ఆయన హీరోగా నటిస్తూ.. జ్యోతిక, కార్తికేయన్ సంతానంలతో కలిసి నిర్మించిన పాన్ ఇండియా చిత్రం 'రెట్రో'. పూజా హెగ్డే కథానాయిక. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకుడు. మే 1న సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రతిష్టాత్మక సితార ఎంటర్టైన్మెంట్స్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నది. శనివారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన దేవరకొండ విజయ్ మాట్లాడుతూ 'నా 10th టైమ్‌లో 'గజనీ' చూశా. సూర్య అన్నని చూడ్డం అదే ఫస్ట్. అప్పట్నుంచే ఆయనపై లవ్ మొదలైంది. పితామగన్, కాకా, సూర్య సన్నాఫ్ కృష్ణన్ ఇలా అయన సినిమాల్నీ చూశా. నా 20ఏండ్ల వయసులో ఆయన్ను కలవాలని గట్టిగా అనుకున్నా. పదిహేనేళ్ల తర్వాత ఆయనతో ఈ మూమెంట్‌ని షేర్ చేసుకునే అవకాశం దక్కింది. ఈ మూమెంట్ నాకెంతో స్పెషల్. పెళ్లిచూపులు, అర్జున్‌రెడ్డి తర్వాత నేను కూడా కాస్త డబ్బులు చూడ్డం మొదలుపెట్టా. దాంతో పిల్లల ఎడ్యుకేషన్ కోసం ఏమైనా చేయాలనే కోరిక ఉండేది. కానీ సూర్య అన్న అగరం ఫౌండేషన్ ద్వారా వేలాదిమంది పిల్లల్ని చదివిస్తున్నారు. నేను కూడా ఆయన దారిలో కొందరినైనా చదివిద్దామనుకుంటున్నా. ' అన్నారు. ఇంకా నిర్మాత సూర్యదేవర నాగవంశీ, డైరెక్టర్ వెంకీ అట్లూరి, యాక్టర్ కరుణాకరన్, గీత రచయిత కాసర్ల శ్యామ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పురావస్తు అన్వేషణలో..



'తండేల్' చిత్రంతో వందకోట్ల వసూళ్ల క్లబ్‌లోకి చేరారు హీరో నాగచైతన్య. తాజాగా ఆయన మరో భారీ ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మించనున్నారు. శనివారం ఈ సినిమాకు సంబందించి 'ఎన్‌సీ 24-ది ఎక్స్‌కవేషన్ బిగిన్స్' అంటూ స్పెషల్ వీడియోను విడుదల చేశారు. ఈ సినిమా కోసం నాగచైతన్య సరికొత్తగా మేకోవర్ అయిన వైనాన్ని వీడియోలో చూపించారు. మిథికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నీల్ డి కున్హా, సంగీతం: అజనీష్ బి లోక్‌నాథ్, సమర్పణ: బాపినీడు, దర్శకత్వం: కార్తీక్ దండు.

## 'హిట్' దర్శకుడితో క్రైమ్ థ్రిల్లర్?



అగ్ర హీరో అక్కినేని నాగార్జున ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ', ధనుష్ 'కుబేరా' సినిమాల్లో ప్రత్యేక పాత్రలు చేస్తున్నారు. ఆ సినిమాలు త్వరలో విడుదల కానున్నాయి. 'నా సామిరంగ' తర్వాత సోలో హీరోగా ఆయన నుంచి సినిమా రాలేదు. దాంతో సోలో హీరోగా ఆయన నటించే సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నాగ్ కూడా గత కొన్ని నెలలుగా కథలు వినే పనిలోనే ఉన్నారట. చాలామంది దర్శకులు ఆయనకి కథలు వినిపించారట. వారిలో దర్శకుడు శైలేష్ కొలను చెప్పిన కథకు నాగ్ లాక్ అయ్యారని ఫిల్మ్ వర్గాల సమాచారం. బీహార్‌లో జరిగిన ఓ హత్య ఘటన ఆధారంగా శైలేష్ రాసుకున్న క్రైమ్ థ్రిల్లర్ ఇదని తెలుస్తున్నది. ఈ కథ నాగార్జునకు బాగా నచ్చిందట. ఆయన పాత్రను శైలేష్ చాలా శక్తిమంతంగా డిజైన్ చేశారని సమాచారం. ప్రస్తుతం శైలేష్ 'హిట్ 3' ప్రచారంలో బిజీగా ఉన్నారు. ఈ హడావిడి తగ్గాక నాగ్ సినిమా స్క్రిప్ట్ వర్క్ మొదలుపెడతారని తెలుస్తున్నది.

## ఉత్తర తెలంగాణ కథలో..




'శతమానం భవతి' వంటి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల్ని మెప్పించారు నాయకానాయికలు శర్వానంద్-అనుపమ పరమేశ్వరన్. ఈ జోడీ మరోమారు వెండితెరపై మెరిసేందుకు సిద్ధమవుతున్నది. సంపత్ నంది దర్శకత్వంలో శర్వానంద్ కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. కేకే రాధామోహన్ నిర్మాత. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్‌ను నాయికగా ఖరారు చేశారు. శనివారం ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటిస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. '1960 దశకంలో ఉత్తర తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో జరిగే కథాంశంతో హై ఇంటెన్స్ పీరియాడిక్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం. శర్వానంద్ గత చిత్రాలకు భిన్నంగా పూర్తి మేకోవర్‌తో కనిపిస్తారు. భారీ వ్యయంతో అత్యుత్తమ సాంకేతిక ప్రమాణాలతో రూపొందిస్తాం. త్వరలో షూటింగ్ ప్రారంభమవుతుంది' అని మేకర్స్ తెలిపారు. ఈ పాన్ ఇండియా చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, రచన-దర్శకత్వం: సంపత్‌నంది.

## 1950 నాటి మద్రాస్ కథ



దక్షిణాదిలో విలక్షణ నటుడిగా పేరు పొందారు సముద్రఖని. ప్రతీ పాత్రలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ తనకంటూ ప్రత్యేకమైన మార్క్‌ను క్రియేట్ చేసుకున్నారు. శనివారం ఆయన జన్మదినం. ఈ సందర్భంగా పాన్ ఇండియా పీరియాడిక్ ఫిల్మ్ 'కాంత' నుంచి ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. 1950 మద్రాస్ నేపథ్యంలో జరిగే ఈ కథ నాటి సామాజిక పరిస్థితులు, సంఘర్షణకు అద్దం పడుతుందని, సముద్రఖని పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని దర్శకుడు తెలిపారు. చిత్రీకరణ పూర్తయిందని, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఝును చంతర్, నిర్మాతలు: రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్, దర్శకత్వం: సెల్వమణి సెల్వరాజ్.

## 'క' దర్శకులతో సినిమా?



హీరో రామ్‌కి ఇప్పుడు విజయం చాలా అవసరం. ప్రస్తుతం ఆయన మహేష్‌బాబు.పి దర్శకత్వంలో నటిస్తున్నారు. 'మిస్ శెట్టి-మిస్టర్ పోలిశెట్టి' సినిమాతో మహేశ్‌బాబుకి దర్శకుడిగా మంచి మార్కులే పడ్డాయి. ప్రస్తుతం ఆయన ద్వితీయవిఘ్నాన్ని అధిగమించేందుకు శాయశక్తులా శ్రమిస్తున్నాడట. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇదిలావుంటే.. 'క' సినిమాతో అందరి దృష్టినీ ఆకర్షించిన దర్శక ద్వయం సుజిత్-సందీప్‌లు ఇటీవలే రామ్‌కి ఓ కథ వినిపించారట. ఇది డిఫరెంట్ స్టోరీ అని సమాచారం. కథ నచ్చడంతో రామ్ కూడా ఓకే చేప్పేశాడని తెలుస్తున్నది. ప్రస్తుతం చేస్తున్న సినిమా పూర్తవ్వగానే, సుజిత్-సందీప్‌ల సినిమాను పట్టాలెక్కించేస్తారట రామ్. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుందని సమాచారం.

## అతను నా మాట మాత్రమే వింటాడు!



'కేజీఎఫ్' ఫ్రాంచైజీ చిత్రాలతో యువతలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది కన్నడ భామ శ్రీనిధి శెట్టి. ఆమె నాని సరసన కథానాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'హిట్-3' మే 1న ప్రేక్షకుల ముందుకురానుంది. శైలేష్ కొలను దర్శకుడు. ఈ సందర్భంగా శనివారం శ్రీనిధి శెట్టి పాత్రికేయులతో ముచ్చటించింది. 'హిట్-3'లో తాను మృదుల అనే పాత్రలో కనిపిస్తానని, స్వతంత్ర భావాలున్న యువతిగా తన పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని చెప్పింది. 'సినిమాలో నాని పోషించిన అర్జున్ సర్కార్ క్యారెక్టర్ ఎంత ఇంటెన్స్‌గా ఉంటుందో ట్రైలర్‌లో చూశారు. ఆయన పాత్రకు పూర్తి భిన్నంగా మృదుల కనిపిస్తుంది. అయితే అర్జున్ సర్కార్..మృదుల మాట తప్పితే ఇంకెవరి మాట వినడు. అలా ఎందుకో చేస్తాడో తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే' అని తెలిపింది. ఈ సినిమా కోసం తెలుగులో సొంతంగా డబ్బింగ్ చెప్పానని, అచ్చ తెలుగు అమ్మాయిలా ఎలాంటి ఉచ్చారణ దోషాలు లేకుండా డబ్బింగ్ పర్‌ఫెక్ట్‌గా వచ్చిందని శ్రీనిధి శెట్టి పేర్కొంది. 'కేజీఎఫ్-3' గురించి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ 'ఈ సినిమాలో నేను నటిస్తున్నానా? లేదా? అనే విషయం ఇప్పుడే చెప్పలేను. కొంతకాలం నిరీక్షించాల్సిందే. హిందీ 'రామాయణ' చిత్రంలో సీత క్యారెక్టర్‌ను నేను తిరస్కరించానని వార్తలొచ్చాయి. అవన్నీ అబద్ధం. అంత గొప్ప పాత్రను రిజెక్ట్ చేసే స్థాయి నాది కాదు. అయితే ఆ సినిమా కోసం ఆడిషన్ మాత్రం ఇచ్చాను. ఆ తర్వాత వాళ్ల నుంచి ఎలాంటి పిలుపు రాలేదు. సాయిపల్లవిని సీత పాత్ర కోసం ఎంపిక చేశారు' అని శ్రీనిధి శెట్టి తెలిపింది.



## యముడి నేపథ్యంలో..

జగదీష్ ఆమంచి హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'యముడు'. 'ధర్మో రక్షతి రక్షితః' ఉపశీర్షిక. శ్రావణి శెట్టి కథానాయిక. చిత్రీకరణ పూర్తయింది. త్వరలో విడుదల తేదీని ప్రకటించబోతున్నారు. ఈ సందర్భంగా శనివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. మైథలాజికల్ టచ్ ఉన్న సినిమా ఇదని, యముడి పాత్ర చుట్టూ వచ్చే సన్నివేశాలు కీలకంగా ఉంటాయని, సరికొత్త కథాంశంతో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: విష్ణు రెడ్డి వంగా, సంగీతం: భవాని రాకేష్, కథ, దర్శకత్వం, నిర్మాత: జగదీష్ ఆమంచి.





